క్లుప్తంగా

అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు



శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు భామామణిని సత్కరిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో నగరానికి చెందిన గరికపాటి ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో 275వ కార్యక్రమంగా ఆదివారం ముక్కామల శ్రీవల్లిచే నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. అనంతరం నిర్వహించిన సభకు గరికపాటి ఆర్ట్స్ థియేటర్స్ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మల్లాది నారాయణ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రీయ విద్వాంసురాలు ముక్కామల భామామణికి ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, సంగీత నిష్ణాతులు పరిమి సావిత్రి, కళారత్న ఎ.పార్వతి రామచంద్రన్, సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాబొట్ల పురుషోత్తమరావు, కో–కన్వీనర్ పుల్లాబొట్ల సత్యవాణి, మైలవరపు గురుశర్మ పాల్గొన్నారు.

వేగవంతంగా రీ సర్వే పనులు



రీసర్వే పనులు చేస్తున్న సర్వేయర్లు

దెందులూరు: మండలంలో పైలెట్ ప్రాజెక్టు గ్రామాలైన రామారావుగూడెం, ముప్పవరం గ్రామాల్లో రీసర్వే పనులు వేగవంతంగా చేస్తున్నామని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. ఆదివారం రీ సర్వే పనులను డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్రతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర మాట్లాడుతూ రామారావుగూడెం గ్రామంలో 69 ఎకరాలు, ముప్పవరంలో 397 ఎకరాల్లో సర్వేయర్లు రీసర్వే చేస్తున్నారన్నారు. ప్రాథమిక దశలో భూమిపై హక్కుదారుడు విస్తీర్ణాన్ని నమోదు చేసి రికార్డుల్లో పొందుపరిచే కార్యక్రమం దాదాపు పూర్తికావచ్చిందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వే రైతుల భూ భద్రత కోసం నిర్వహించే శాశ్వత ప్రక్రియ అన్నారు. రైతులందరూ రీసర్వే రెవెన్యూ సిబ్బందికి తమ పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హేమమాలిని, విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

వలంటీర్ల పొట్టకొట్టిన కూటమి సర్కార్

- గత ఏడాదిగా విధులకు దూరం
- ఎలా బతకాలని వలంటీర్ల ఆవేదన
- తక్షణం విధుల్లోకి తీసుకోవాలంటున్న వలంటీర్లు
- నాడు రూ.10 వేలు ఇస్తామని నేడు పొమ్మంటున్నారు



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వలంటీర్లు (ఫైల్)



వార్డు సచివాలయం, వెంకటాపురం

ఏలూరు (టూటౌన్): కూటమి సర్కార్ ఏడాది పాలనలో చిరుద్యోగులను వీధుల పాలు చేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయ వ్యవస్థలో గౌరవ వేతనం తీసుకుంటూ పని చేసే వలంటీర్ల పట్ల ఎన్నికలకు ముందు నంగనాచి కబుర్లు చెప్పి, వారికి నెలకు రూ.10 వేల వేతనం ఇస్తామని చెప్పింది. తీరా అధికారం చేపట్టిన వెంటనే వలంటీర్ల పొట్ట కొట్టి వారి ఉసురు మూట గట్టుకుంది. తమ లాంటి చిరుద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వం కక్ష గట్టి విధులకు దూరంగా ఉంచడం తగదంటూ ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలకు తమకు సంబంధం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున తమకు నెలకు రూ.5 వేలు గౌరవ వేతనం ఇచ్చి విధుల్లోకి తీసుకుందన్నారు. విద్యార్హత పదో తరగతి అని చెప్పినా భవిష్యత్తులో తమకు ప్రభుత్వ ఉద్యోగం వస్తుందనే ఆశతో డిగ్రీ, పీజీ వంటి ఉన్నత విద్యార్హతలు ఉన్నా తాము వలంటీర్ విధుల్లో చేరామని చెబుతున్నారు. తమను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిందనే ఒకే ఒక కారణంతో గత ఏడాది కాలం నుంచి విధులకు దూరం పెట్టి కనీసం ఇచ్చే రూ.5 వేలు వేతనం కూడా ఇవ్వకపోవడంపై వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు.

ఏలూరు నగర పాలక సంస్థలో వాలంటీర్ల వివరాలిలా..		
మొత్తం డివిజన్లు	:	50
మొత్తం సచివాలయాలు	:	79
పని చేసే వాలంటీర్లు	:	1,434
మొత్తం ఇళ్ల సంఖ్య	:	88,366
రేషన్ కార్డుల సంఖ్య	:	66,075

ఏలూరు కార్పొరేషన్‌లో వలంటీర్ల వివరాలు ఇలా...

ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 88,366 ఇళ్లు ఉన్నాయి. మొత్తం రేషన్ కార్డులు 66,075 ఉన్నాయి. క్లస్టర్లు 1484 ఉండగా మొత్తం డివిజన్లు 50 ఉన్నాయి. 79 వార్డు సచివాలాయలు ఉండగా వీటి పరిధిలో మొత్తం 1,434 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. జీతం తక్కువే అయినా ప్రజలకు సేవ చేయాలనే భావంతో ఈ చిరు ఉద్యోగంలో పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు చేరారు. ఇప్పుడు తమ జీవితాలు రోడ్డున పడ్డాయని వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు.

రూ.10 వేల వేతనం హామీ హుష్‌కాకి

ఎన్నికల ముందు కూటమి నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ల వేతనం రూ.10 వేలకు పెంచుతామంటూ ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారు. సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏలూరులో నిర్వహించిన వారాహి యాత్రలో వలంటీర్లపై అమితమైన ప్రేమను, బాధను ఒలకబోశారు. రూ.5 వేల గౌరవ వేతనం ఇచ్చి వలంటీర్లతో గొడ్డు చాకిరీ చేయిస్తున్నారని వైఎస్సార్‌సీపీపై విమర్శలు గుప్పించారు. మరి అధికారం చేపట్టి ఏడాది దాటినా నేటి వరకు వలంటీర్లపై ఎటువంటి ప్రకటన చేయకుండా వారిని విధుల్లోకి తీసుకోకపోయినాడిప్యూటీ సీఎం నోరు మెదపకపోవడంపై వలంటీర్లు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తాము అధికారం చేపట్టాక వలంటీర్లను కొనసాగిస్తామంటూ ఇచ్చిన హామీ హుష్ కాకి అయిందని వలంటీర్లు బాధను వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిగా విధులకు దూరంగా ఉంటున్నాం



నగరపాలక సంస్థలో పని చేస్తున్న వార్డు వాలంటీర్లకు గత ఏడాదిగా వేతనాలు ఇవ్వడం లేదు. కనీసం విధుల్లోకి తీసుకోకుండా మమ్మల్ని గాలిలో పెట్టారు. గతంలో ఇచ్చిన రూ.5 వేల గౌరవ వేతనం అయినా చెల్లిస్తే మా కుటుంబాలకు ఆసరాగా ఉంటుంది. రాజకీయాల ముసుగులో మమ్మల్ని పక్కన బెట్టడం ఎంత వరకు సమంజసం.ఇప్పటికైనా ప్రభుత్వం మాపై కనికరం చూపాలి.

–బి.పృథ్వీరాజు, వలంటీర్, లంకపేట సచివాలయం, ఏలూరు

సేవలకు దూరంగాను ఉంచుతున్నారు



గతంలో వలంటీర్లుగా మేము ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు ఇచ్చే పింఛన్లను దగ్గరుండి తమ పరిధిలోని ప్రజలకు క్రమం తప్పకుండా అందే విధంగా చర్యలు తీసుకునేవారం. అన్ని ప్రభుత్వ పథకాలను వారికి అందేలా చూసేవారం. అలాంటి తమను విధులకు దూరం పెట్టడం భాదాకరం. తక్షణం మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలి.

–ఎస్‌కే బాషా, వలంటీర్, ఫిలోస్‌పేట సచివాలయం, ఏలూరు

వలంటీర్లపై ప్రభుత్వం కక్ష సాధింపు తగదు



గ్రామ, వార్డు వలంటీర్లకు తక్షణం వేతన బకాయిలు చెల్లించాలి. గత ఏడాది కాలంగా వలంటీర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వలంటీర్ల పట్ల సానుకూలంగా స్పందించి వారికి చెల్లించాల్సిన వేతనాలు తక్షణం విడుదల చేయాలి. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ల వేతనాలు నెలకు రూ.10 వేలకు పెంపుదల చేయాలి.

–ఆర్.లింగరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు జిల్లా

యువత పోరుకు ఏర్పాట్లు పూర్తి



యువత పోరుకు ఫ్లకార్డులు సిద్ధం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

దెందులూరు: నిరుద్యోగభృతి, ఫీజు రీయంబర్స్‌మెంట్ సమస్యలపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఏలూరులో సోమవారం యువత పోరు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైఎస్సార్‌సీపీ యువజన భాగం ఏలూరు అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు.

ఫిజికల్ డైరెక్టర్ల బదిలీ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలంలోని ఉన్నత పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు బదిలీ అయ్యారు. కండ్రిగూడెం ఉన్నత పాఠశాలకు పోతునూరు ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఎం.కృష్ణారావు నియమితులయ్యారు. శ్రీపర్రు ఉన్నత పాఠశాలకు గుండుగొలను ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న వి.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. సత్రంపాడు ఉన్నత పాఠశాలకు తాడేపల్లిగూడెంలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న కె.చంద్రశేఖరరావు నియమితులయ్యారు. హనుమాన్‌నగర్ ఉన్నత పాఠశాలకు పెదపాడు ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న బీఎల్ నాయుడు నియమితులయ్యారు.

నేడు ఆక్వా గ్రామ సభలు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలంలో సోమవారం మూడు గ్రామాల్లో ఆక్వా గ్రామ సభలు నిర్వహిస్తామని ఏలూరు మండల మత్స్యశాఖ అధికారి సతీష్ తెలిపారు. మాదేపల్లి, శ్రీ పర్రు, జాలిపూడి గ్రామాల్లో ఆక్వాకు సంబంధించి గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథి గా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజ్‌కుమార్ విచ్చేస్తారన్నారు.

మున్సిపల్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసడాంగే

ఏలూరు (టూటౌన్): ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు రావలసిన ఇంక్రిమెంట్లు, మెడికల్ బిల్లులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక స్ఫూర్తి భవనంలో మున్సిపల్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.కిషోర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బజంత్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న 140 మంది పర్మినెంట్ ఉద్యోగులకు 3 సంవత్సరాల నుంచి రావలసిన బకాయిలు ఉన్నాయన్నారు. వీరిలో చాలా మందికి మూడు సంవత్సరాల నుంచి ఇంక్రిమెంట్లు, స్పెషల్ ఇంక్రిమెంట్లు (6,12,18,24), బకాయిలు, 9 నెలల నుంచి మెడికల్ బిల్లులు, గత రెండున్నర సంవత్సరాల నుంచి చనిపోయిన, రిటైర్‌మెంట్ అయిన వారికి రావలసిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు బకాయిలు చెల్లించడం లేదన్నారు. ఉద్యోగులు వారికి రావలసిన బకాయి బిల్లుల కోసం ఆఫీస్ చుట్టూ పదేపదే తిరుగుతున్నా సాంకేతిక కారణాలు చెబుతూ చెల్లించడం లేదన్నారు. కాబట్టి పారిశుధ్య ఉద్యోగులకు రావలసిన బకాయి బిల్లులు వెంటనే క్లియర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎలగాడ దుర్గారావు , ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు దొడ్డికర్ల నాగబాబు, వై.ప్రసాద్, కె.నాగేంద్ర, బొచ్చ శంకర్, బంగారు లక్ష్మి, మాడుగుల భవాని, బంగారం అంకమ్మ, బంగారు సురేష్, పొద్దుటూరు సురేష్, బంగారు దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ యువత పోరు



'యువత పోరు' వివరాలు వెల్లడిస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డీఎన్‌ఆర్, నాయకులు (ఫైల్)

ఏలూరు టౌన్: కూటమి పాలనలో నిరుద్యోగ యువత, విద్యార్థి లోకం తీవ్ర అవస్థలు పడుతుందని, ఓ వైపు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి లేక అల్లాడుతుంటే మరో వైపు విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆటకెక్కే దుస్థితి ఏర్పడిందని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఏలూరులో నేడు భారీ ఎత్తున యువత పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆయన తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్తలు, పార్టీ నాయకులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు భారీ సంఖ్యలో ర్యాలీకి హాజరు కావాలని పిలుపునిచ్చారు.

నేడు ఏలూరుకు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, జక్కంపూడి రాజా

ఏలూరులో భారీ ఎత్తున చేపడుతున్న వైఎస్సార్‌సీపీ యువత పోరుకు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హాజరవుతారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసంపై నిలదీసేందుకు, శాంతియుతంగా నిరసన తెలిపేందుకు యువత పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్, జిల్లా పరిశీలకులు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ హాజరవుతారు. ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, నూజివీడు సమన్వయకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు, ఉంగుటూరు సమన్వయకర్త పుప్పాల వాసుబాబు, పోలవరం సమన్వయకర్త తెల్లం బాలరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నాని, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పాతినవలస రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ వర్గాలు పేర్కొన్నాయి.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	24	బీక్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	32	చామదుంపలు	40
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	--
కాకర కాయలు	44	బీట్‌రూట్	40
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	18
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	28
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	17
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	27
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

కార్మికవర్గం రాజకీయ చైతన్యం పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఏలూరు (టూటౌన్): ప్రపంచ పరిణామాలు వేగంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కార్మిక వర్గం రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి తెలిపారు. ఈ క్రమంలో ఆగస్టు 28, 29, 30, 31 తేదీల్లో ఏలూరులో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర రాజకీయ తరగతులు, జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాల్సిందిగా ఆయన పిలుపు నిచ్చారు. స్థానిక కాశీ విశ్వేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఇఫ్టూ అనుబంధ కార్మిక సంఘాల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు రాజకీయ చైతన్యంతో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్ల పేరుతో కేంద్రంలోని మోదీ, షాల ప్రభుత్వం దేశ కార్మిక వర్గంపై దాడి చేస్తుంటే, రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంచటం, మహిళలు రాత్రి వేళల్లో పని చేయాలని నిర్ణయించడం జీతభత్యాలు పెంచకుండా, కార్మిక హక్కులు హరించటానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యూవీ, నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, ఇఫ్టూ నాయకులు కేవీ రమణ, బద్దా వెంకట్రావు, రామ్మోహన్, మామిడి దాన వర ప్రసాద్, ఇ.గ్రీష్మకుమార్, జి.రాంబాబు, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు దక్కేవరకూ పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత

ఏలూరు (టూటౌన్): సీపీఐ ఏలూరు ఏరియా నూతన సమితి సమావేశం కురెళ్ళ వరప్రసాద్ అధ్యక్షతన ఆర్‌ఆర్‌పేట, స్ఫూర్తి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాకు కేంద్రంగా, కార్పొరేషన్ అంటూ పేరుకే గాని ఏలూరులో ప్రజలకు ఇప్పటికీ పరిష్కారం కాని సమస్యలు అనేకం ఉన్నాయని తెలిపారు. పెరుగుతున్న ఏలూరు ఏరియా జనాభాకు అనుగుణంగా ప్రజల అవసరాలని తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేశారు. సొంత ఇల్లు, తాగునీరు, విద్యా, వైద్యం మురికి వాడల్లో నివసించే ప్రజల కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఏలూరు ఏరియా నూతన సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్ల ఇటి స్థలం స్థలం ఇవ్వాలని, టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించి తక్షణమే లబ్దిదారులకు అందించాలని కోరారు. సమావేశంలో నూతన సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సీపీఐ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (టూటౌన్): సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ శనివారం సమితి మహా సభలు నిర్వహించామన్నారు. నూతన కార్యవర్గంలో ఏలూరు ఏరియా సమితి కార్యదర్శిగా ఉప్పులూరి హేమ శంకర్, సహాయ కార్యదర్శులుగా, కురెళ్ల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, మావూరి విజయ, సాయన అభిలాష్ కుమార్, గొర్లి స్వాతి, కొల్లూరి సుధా రాణి, 19 మంది కౌన్సిల్ సభ్యులు, ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులు ఎన్నికైనట్లు తెలిపారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు ప్రారంభించి 21 సంవత్సరాలు కావస్తున్నా నిర్వాసితుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని రైతు కూలీ సంఘం (ఏపీ) జిల్లా కార్యదర్శి షేక్ భాషా పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నిర్వాసిత కాలనీలన్నీ తక్కువ కూలికి దొరికే లేబర్ అడ్డాలుగా మారాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం కొండ మొదలు పంచాయతీలో గిరిజనుల సాగులో ఉన్న 426 ఎకరాల భూమికి ప్రభుత్వం 2017లో ఒప్పందం చేసుకుందన్నారు. ఈ ఒప్పందాన్ని అమలు చేయలేదని వాపోయారు. కత్తనపల్లి, కొత్తగూడెం గ్రామాలకు చెట్ల నష్ట పరిహారం, ఆర్అండ్ఆర్, భూమికి భూమి ఇవేవీ ఇవ్వలేదన్నారు. ఎన్నో దఫాలు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 23న రంపచోడవరం ఐటీడీఏ ఆఫీస్ వద్ద కొండ మొదలు సర్పంచ్, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వేట్ల విజయ దీక్షను ప్రారంభిస్తారన్నారు. ఈ దీక్షకు మద్దతుగా రైతు కూలీ సంఘం (ఏపీ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ఈ నెల 24న ధర్నా నిర్వహిస్తాన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూమి, అడవి, సంపూర్ణమైన పునరావాసం కల్పించాలన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించాలన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 24న ఏలూరు కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాల్సిందిగా నిర్వాసితులకు, ప్రజాతంత్ర వాదులకు షేక్ బాషా విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని సిద్ధార్థ, ఎంఆర్‌సీ, సత్రంపాడు ఫీడర్లలో సోమవారం వార్షిక మరమ్మతులు చేపడుతున్నట్లు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఈ నెల 23వ తేదీన నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. నగరంలోని సత్రంపాడు, మండవవారి వీధి, విద్యుత్ కాలనీ, ఎంఆర్‌సీ కాలనీల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మొబైల్ ఆక్వా ల్యాబ్ సేవలకు బ్రేక్

30 వేల ఎకరాల ఆక్వా చెరువుల పరీక్షలు ప్రశ్నార్థకం



ఆక్వా ల్యాబ్

దెందులూరు: మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆక్వా మొబైల్ ల్యాబ్ సేవలు నిలిచిపోయాయి. పదేళ్ల కిందట మత్స్యశాఖ ఆధ్వర్యంలో దెందులూరు ఏలూరు రూరల్ పెదపాడు మండలాలకు సంబంధించి ఆక్వా రైతుల పొలాల పరీక్షల కోసం మొబైల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. రైతులు ఏలూరులోని ల్యాబ్‌కు రానవసరం లేకుండా గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి మేత, నీరు ఇతర శాంపిల్స్ తీసుకునేవారు. మొబైల్ వ్యాన్ రైతుల వద్దకు వెళ్లి మొబైల్ ల్యాబ్‌లో ఉన్న టెస్టులు చేస్తారు. మిగిలిన టెస్టులకు సంబంధించి శాంపిల్స్ తీసుకొని ఏలూరు మత్స్య శాఖ కార్యాలయానికి వచ్చి పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేసి రిపోర్టులను రైతులకు పంపుతారు. కానీ కొంత కాలంగా ఈ సేవలు నిలిచిపోయాయి. దీంతో దెందులూరు, ఏలూరు రూరల్, పెదపాడు మండలాల్లోని 30 వేల ఆక్వా రైతుల సాగు భూముల పరీక్షలు ప్రశ్నార్థకంగా మారాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రంగా ఆక్వా ల్యాబ్ సేవలు

ఆక్వా మొబైల్ ల్యాబ్ సేవల బాటలోనే ఏలూరు మత్స్యశాఖ జిల్లా కార్యాలయంలోని ఆక్వా ల్యాబ్‌లో కూడా పరీక్షలు తూతూమంత్రంగా ఉన్నాయి. ఆక్వాకు సంబంధించి మేత తొలి అతి ముఖ్యమైన ప్రాధాన్యతాంశం. మేతకు సంబంధించి నాలుగు పరీక్షలు ఈ ల్యాబ్‌ల్లో చేయాల్సి ఉండగా ఒక పరీక్ష మాత్రమే చేస్తున్నారు. మిషన్లు పని చేయని కారణంగా పరీక్షలు చేయడం లేదని అధికారిక సమాచారం. కూటమి ప్రభుత్వం ఆక్వాకు తొలి ప్రాధాన్యతనిస్తామని, ఆక్వా రైతుల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామంటూ చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఇది ఆచరణ సాధ్యం కావడం లేదని రైతులు వాపోతున్నారు.